# మేలు

మేనల్లుడికి స్వయంగా ఫోన్ చేసి చెప్పినా తన అభ్యర్థికి ఉద్యోగం ఇవ్వలేదని డాక్టర్ మురళీధరానికి కోపం వచ్చింది. కోపంగానే మేనల్లుడికి ఫోన్ చేశారు.

"ఒరేయ్ వాసూ! మా వెంకట్రావు కొడుక్కి ఉద్యోగం రాలేదట. నీకు తెలుసా?"

"తెలుసు మావయ్యా!"

"తప్పకుండా చేస్తానన్నావే "

"ఏం చెయ్యను మావయ్యా! అంతా లంచాలు పుచ్చుకునే ఉద్యోగాలిచ్చారు."

"నువ్వు పెద్ద ఆఫీసరువి గదా! ఆ మాత్రం పలుకుబడిలేదా నీకు."

"ఎందుకు లేదు మావయ్యా? నా వాటా రెండు ఇచ్చారు. రెండేసివేలు పుచ్చుకుని ఉద్యోగాలిచ్చాను."

"ఒరేయ్ వాసూ! మాట ముఖ్యమా? డబ్బు ముఖ్యమా నీకు?"

"డబ్బు మావయ్యా!"

"ఛీ! కృతఘ్నుడా! మేలు చేసినవారికి ఇలా నమ్మకద్రోహం చెయ్యగూడదురా."

"నాకు నువ్వు ఏం మేలు చేశావు మావయ్యా?"

"అప్పుడే మర్చిపోయావురా. ఏడేళ్ళ క్రితం మీ నాన్నకు పక్షవాతం వచ్చినప్పుడు నా నర్సింగ్ హోమ్‌లో మూడు నెలలు ట్రీట్‌మెంట్ ఇచ్చి మళ్ళీ మనిషిని చేశాను గదరా. అదే వేరే డాక్టర్ అయితే వేలకువేలు ఫీజులంటూ వసూలు చేసే వాళ్ళు "

"అది మేలు ఎలా అవుతుంది మావయ్యా!"

"మరి దాన్ని ఏమంటారు?"

"కీడు."

"ఒరేయ్ ఒరేయ్ వాసూ!"

"నిజం మావయ్యా: నువ్వు ట్రీట్‌మెంట్ ఇచ్చి ఆయన్ని బ్రతికించి నన్ను చంపావు. ఈ ఏడేళ్ళపాటూ ఆయనకు మందులనీ, మాకులనీ కొంటున్నానా? ఇక పళ్ళరసాలు, సిగిరెట్లు, చాకలి ఖర్చు, మంగలి ఖర్చు, తిండి ఖర్చు లెక్కేసుకుంటే కనీసం సంవత్సరానికి రెండువేలు అనుకున్నా, ఈ ఏడేళ్ళకీ హీనంగా పద్నాలుగువేలు ఖర్చయిపోయాయి అదే మా నాన్నను జనరల్ హాస్పటల్లో జేర్పించివుంటే అప్పటికప్పుడే పోయి వుండేవాడా? నాకీ పద్నాలుగువేలూ మిగిలేవి గదా. ఆ డబ్బుతో మా పెద్దాడ్ని యమ్.బి బి.ఎస్ "

డాక్టర్ మురళీధరం కోపంతో రిసీవర్ పెట్టేశాడు.

—వాణిశ్రీ

